

# 'అదే' కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

### 62

## కవల పిల్లలు

**చాలా దేశాలలో** కొంత సాధారణంగా, మనదేశంలో అతి మామూలుగా కనిపించే ఒక వింత గమనించారా? కవల పిల్లలు పుడితే పేర్లు ఒకేలాగ ఉండేలా పెట్టడం; అమల, విమల; అతుల్, వితుల్; అనిల్, వినీల్; అఖిలేష్, నిఖిలేష్ ఇలాగన్నమాట.

అందుకే మన పచారీకొట్టు పటేల్ గారికి అహ్మదాబాద్ లో కవలపిల్లలు పుడితే అజిత్, సుజిత్ అని పెట్టారు పేర్లు. అప్పట్లో పటేల్ నాన్నగారికి అమెరికాలో "వేలువిడవని" చుట్టం ఉండేవాడు. మన తెలుగువాళ్లమైతే దగ్గిర/దూరం చుట్టాలని సులభంగా వదిలేసుకుని ఆయన నా "వేలువిడిచిన" అంటూ చెప్పుకుంటాం. కానీ అహ్మదాబాద్ లో అలా వేలు విడిచే ప్రసక్తి లేనేలేదు. ఒకరికొకరు సహాయం చేసుకుంటూ బిజినెస్సులు పైకీ, పైపైకి తీసుకెళ్తూ ఉంటారు. అందువల్ల ఈ వే.వి చుట్టం ఓ సారి ఇండియా వెళ్ళినప్పుడు చెప్పాడు పటేల్ నాన్నగారికి. 'కుర్రాళ్లని ఇంగ్లీషు మీడియంలో చదివించు, అమెరికా తీసుకు వెళ్ళడానికి నేనున్నాను' అంటూ. అలా కవలలిద్దరికీ చిన్నప్పుడే అమెరికా మార్గం సుగమం చేసి వెనక్కి వెళ్ళాడు చుట్టం.

పదో తరగతిలోకి వచ్చేసరికి అత్యంత దగ్గిర స్నేహితులకి కూడా అజిత్, సుజిత్ లని విడదీసి చెప్పడం కష్టం అయ్యేది వీళ్ళ పోలికల వల్ల. అన్నింటికన్నా కష్టం ఏమిటంటే వీళ్ళిద్దరూ ఒకరి బట్టలు ఒకరు వేసుకోవడం వల్ల 'క్రితం రోజు నేను మాట్లాడింది అజిత్ తోనా సుజిత్ తోనా?' అనేది ఎవరికీ అర్థం అయ్యేది కాదు. స్కూల్ మేష్టర్లకి మాత్రం అర్థమైంది వీళ్ళని ఎలా వేరుగా గుర్తుపట్టాలో. అజిత్ ఇద్దర్లో మంచి బ్రిలియంట్. వాడికొచ్చే మార్కులూ రాసే రాతా కొంచెం భిన్నంగా ఉండడం చూసి వాళ్ళు గుర్తు పట్టేయడం నేర్చుకున్నారు. డిగ్రీ చేతిలోకి వచ్చేసరికి అనుకున్నట్టుగానే అజిత్ పటేల్ పరీక్షలు రాసి, ముందు ప్రామిస్ చేసిన బంధువు వేలు పట్టుకుని అమెరికాలో తేలాడు. సుజిత్ గారు దేశంలోనే ఉండాల్సిన పరిస్థితి – మార్కులు బాగా రాకపోవడం ఒక కారణం అయితే, ఓ కొడుకు అమెరికా వెళ్ళాక రెండోవాడైనా కళ్ళ ఎదట ఉంటే మంచిదని తల్లీ తండ్రీ అనుకోవడం రెండో కారణం.

అమెరికా వచ్చిన రెండేళ్ళకి ఎమ్. ఎస్ చదువు అవుతూండగానే అజిత్ పటేల్ మీతాబెన్ ను కల్సుకోవడం ఆవిడ ఈయనకన్నా ఒక మూడేళ్ళు పెద్దదైతేమాత్రం ఏమైంది, మరేం ఫర్వాలేదనుకోవడం, వీళ్ల పెళ్ళికి, ముందు సహాయం చేసిన వే.వి బంధువు సరే అనడం ఈజీగా జరిగాయి. అన్నింటికన్నా ముఖ్యం ఏమిటంటే మీతాబెన్ గారు అమెరికాలో పుట్టిన వారు. ఒకరిద్దరు తెల్లవాళ్ళని డేట్ చేసారు గానీ నచ్చక వదిలిపెట్టారు. అజిత్ అయితే మనవాడే. కల్సి ఉండొచ్చు. అదీ గాక రోటీ, కపడా మన ఆచారాలే కనక పెద్దగా విభేధాలు రావు వంటింట్లో. వంటిల్లు అనుకున్నాం కనక మిగిలిన మకాన్ అనేది అతి సులభంగా దొరుకుతుంది అమెరికాలో, మకాన్ కొనుక్కోవడానికి వందల కొద్దీ బేంకులూ, మరో వైపు క్రెడిట్ వారూ, ఏజెంట్లు అప్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. మిగతా విషయాలు మరింత వేగంగా జరిగాయి. అమెరికానుంచి ఆడపెళ్ళివారు బంధుమిత్ర సమేతంగా దేశం వెళ్ళి అజిత్, మీతాబెన్ లని ఒకటి చేసి వెనక్కొచ్చారు. అమెరికన్ సిటిజన్ ని పెళ్ళి చేసుకుంటే గ్రీన్ కార్డ్ రావడం ఎంతసేపు? ఇంక మిగిలింది ఓ బిజినెస్ పెట్టుకోవడం, తన ట్విన్ అయిన సుజిత్ నీ, తల్లి తండ్రులనీ అమెరికా తీసుకురావడం వగైరా. ఇవి సులభంగా పదేళ్ళలో జరిగేలా చూడవచ్చు.

అజిత్ గారు నాలుగేళ్ళు ఉద్యోగం చేసి కూడబెట్టిన డబ్బులతో, మామగారి సహాయంతో ఓ లాడ్జ్ – అంటే అమెరికా పద్ధతుల ప్రకారం ఓ హొటల్ – కొన్నాడు అప్పుచేసి. ఉన్న ఊర్లో మరో ఏడాదికి ఓ పచారీ కొట్టు – దేశీ బజార్ అనేది మొదలుపెట్టారు. రెండింట్లోనూ లాభాలు వస్తున్నై. ఇటువంటప్పుడు ఓ సారి దేశం వెళ్ళడానికి అజిత్, మీతాబెన్ లు తయారయ్యేరు. జీవితంలో అనుకోని సంఘటనలు ఎదురవడం అనేది సర్వసాధారణమైన విషయం. కానీ అవి జరిగినప్పుడు మనకి అలా అనిపించవచ్చు అంతే. అదే జరిగింది అజిత్ కి ఇండియాలో.

ఇండియా వచ్చిన వారం రోజులకి అజిత్ ప్రాణం పోయింది. పొద్దున్నే ఎంతకీ లేవడం లేదని వెళ్ళి చూసేసరికే ఆయన వళ్ళు చల్లబడి ఉంది. రాత్రి నిద్రలో హార్ట్ ఎటాక్ లేదా స్ట్రోక్ వల్ల పోయి ఉండొచ్చని డాక్టర్ అన్నారు. ఇదో పెద్ద షాక్ అందరికీ. కుర్రాడు, నిండా ముప్పై ఐదేళ్ళు లేవు. కానీ చేయాల్సింది చేయాలి. మీతాబెన్ ఒకరూ వెనక్కి వెళ్ళాలి.

లాడ్జ్, గ్రోసరీ షాపు చూడ్డానికి ఎవరూ లేరు. ఎలా? అప్పుడు మరోసారి వేంచేసిన బంధువు చెప్పాడు సుజిత్ మీరాబెన్ వంటి అంతరంగికులని 'అతి రహస్యంగా' కూర్చోబెట్టి. అజిత్ బదులు ఆయన పాస్ పోర్ట్ పట్టుకుని సుజిత్ గారు మీరాబెన్ తో పాటు అమెరికా వచ్చేస్తారు. కవలలు కనక ఎవరూ గుర్తు పట్టలేరు. మీరాబెన్ గారితో ఆయనకి ఎటువంటి సంబంధం లేదు. ఆవిడా, ఈయనా వేరువేరుగా బతుకుతారు కానీ బిజినెస్ చూసుకోవడానికి సుజిత్ ఉంటాడు.

ఈ ఐడియాకి మొదట్లో మీరాబెన్ కీ, ఆవిడవైపువారికీ కళ్ళు బైర్లు కమ్మాయి. నిజంగా ఇది సాధ్యమా? ఎవరో ఒకరు ఎలాగోలా తెలుసుకుంటే ఏమౌతుంది? ఇది జీర్ణించుకోవడానికి మరో వారం పట్టింది. సుజిత్ ని చూసిన ఎవరూ అజిత్ కాదు అని చెప్పలేరు. ఇండియాలో ఉన్న అమెరికన్ కాన్సులేట్ కి చెప్పక్కర్లేదు అజిత్ పోయినట్టు. మల్లగుల్లాలు పడ్డాక ఏదైనా పీకలమీదకి వస్తే ఇదంతా సుజిత్ తప్పే ఇది అని ఆయన్ని 'డిపోర్ట్' చేయించవచ్చు అని అందరూ ఒప్పుకున్నాక సుజిత్ వదినగారితో అజిత్ పాస్ పోర్ట్ మీద అమెరికా వచ్చేసాడు. ఇండియా ఎయిర్ పోర్ట్ లలో, అమెరికా ఇమ్మిగ్రేషన్ లో ఎవరికీ అనుమానం రావడానికి ఆస్కారం లేకపోయింది. మీతాబెన్ గారి సహాయంతో ఇమ్మిగ్రేషన్ లో అడిగిన 'ఎన్నాళ్ళు ఇండియా వెళ్ళారు (మూడు వారాలు), ఎందుకు వెళ్ళారు (పేరెంట్స్ ను చూడ్డానికి)' అనే ప్రశ్నలకి సమాధానం ఇంగ్లీషు మీడియంలో చదువుకున్న సుజిత్ ఈజీగా సమాధానాలు చెప్పేసి బయటకొచ్చాడు, లేదా అమెరికాలో అధికారికంగా అడుగుపెట్టాడు.

ఇది జరిగిన తొమ్మిది నెలలకి సుజిత్ కారు డ్రైవింగ్, అమెరికా పద్ధతులూ అన్నీ నేర్చేసుకుని ఇక్కడ జీవితానికి అలవాటు పడ్డాక ఈ సారి అజిత్ మామగారు మరో సలహా ఇచ్చారు. మీరాబెన్ కి పిల్లలు లేరు కనక ఇప్పుడు అవిడ పెళ్ళిచేసుకోవాలంటే విడాకులు కావాలి. మళ్ళీ మల్లగుల్లాలు పడ్డాక ఓ లాయర్ సహాయంతో కోర్టుకెళ్ళారు విడాకులకి. విడాకులకి కారణాలు అంతర్గతం, అవి పైకి చెప్పరాదు, వినరాదు. లాయర్ తన శక్తీ కొద్దీ ప్రయత్నం చేసి విడాకులు ఇప్పిస్తాడు. ఎందుకండీ అంత 'శక్తి కొద్దీ ప్రయత్నం' అనే ప్రశ్న వేస్తున్నారా మళ్ళీ? పొద్దున్న నుంచి సాయంత్రం వరకూ లాయర్ గారి బిజినెస్సే ఇలా విడాకులు ఇప్పించడం, అందుకే. గ్రీన్ కార్డ్ కి ఢోకా ఏమీలేదు ఈ విడాకుల వల్ల, అజిత్ మీరాల పెళ్ళై మూడేళ్ళ పైన అవలేదూ?

విడాకులు వచ్చాక కూడా అజిత్ మామగారు, సుజిత్ బిజినెస్ లు కలిసి చేస్తూనే ఉన్నారు. పెళ్ళి పెళ్ళే, బిజినెస్ బిజినెస్సే, రెండూ ఏ నాడు కలవరాదు అనే బంగారం వంటి రూల్ ఉంది కదా? మరో ఏడాదికి మీతాబెన్ మరొకరిని డేట్ చేస్తూ అజిత్ ని మర్చిపోయారు. ఈ లోపున సుజిత్ గారికి (అదే లేట్ అజిత్ గారికి) సిటిజన్ షిప్ అప్లికేషన్ కోసం ఎలిజిబిలిటీ వచ్చింది. అదో ఏడాది తతంగం. దానికి కాయితాలు పెట్టి అదొచ్చాక దర్జాగా ఇండియా వచ్చారు సుజిత్ గారు ఓసారి దేశం చూడ్డానికి అజిత్ పేరు మీద ఉన్న అమెరికా పాస్ పోర్ట్ తో. ఆ ట్రిప్ లో అమ్మా నాన్నలు చూపించిన అమ్మాయిని పెళ్ళి చేసుకుని వెనక్కి వచ్చేసారు. ఇది సుజిత్ కి మొదటి పెళ్ళి కానీ ఆయన అజిత్ గా రెండో పెళ్ళి

చేసుకున్నట్టూ రికార్డ్ అయింది. అజిత్ శారీరకంగా చచ్చిపోతే సుజిత్ నామకః చచ్చిపోయి అజిత్ అయిపోయేడు. ఈయన అమెరికన్ సిటిజన్ కనక కొత్త భార్య ఆర్నెల్లలో అమెరికాలో తేలింది.

అదేమిటండి అంత సులభమా, ఇటువంటి విషయాలు ఎవరికీ తెలియకుండా ఎలా ఉంటై? నిజమే తెలియకుండా ఉండదు. కానీ అంతర్గతంగా చెప్పుకున్న విషయాలు వీళ్ళు ఎవరితోనూ ఏదైనా చెపితే కదా ఇవన్నీ బయటకొచ్చేది? వీళ్ళు చెప్పినా ఎవరో ఒకరు కంప్లైంట్ ఇవ్వాలి ఇలా జరిగింది చూసుకోండోహో అంటూ అన్ని వివరాలూ ఇస్తూ. అలా వివరాలు సంపాదించడానికీ, ఉత్తరాలు రాసి కంప్లైంట్ ఇవ్వడానికీ  ఎవరికీ తీరికా, కోరికా, ఓపికా లేదు కనక సర్వేజనా సుఃఖినోభవంతు.

నీతి: నోరు విప్పనంత కాలం ఇంటి దొంగని ఈశ్వరుడు కూడా పట్టలేడు.

Post your comments